సాక్షి పెద్దపల్లి

సోమవారం । 22 । ఏప్రిల్ । 2024



ఆదివరాహస్వామికి పూజలు

కమాన్‌పూర్: శ్రీఆదివరాహస్వామిని రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి శశాంక్ గోయల్ ఆదివారం దర్శించుకున్నారు.



మల్లన్నకు పట్నాలు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో భక్తులు ఆదివారం పట్నాలు వేశారు. బోనాలతో నైవేద్యం సమర్పించారు.



వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. వడగాడ్పులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లాలో కేసీఆర్ బస్సుయాత్ర



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కేసీఆర్ బస్సుయాత్ర తేదీలు ఖరారయ్యాయి. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బస్సుయాత్ర తలపెట్టారు. ఈనెల 24న ప్రారంభమయ్యే ఈ యాత్ర మొత్తం 17 రోజులపాటు జరగనుంది. యాత్ర ఐదురోజుల పాటు ఉమ్మడి జిల్లాల్లో సాగనుంది. మే 2న జమ్మికుంట, 3న రామగుండం, 5న జగిత్యాల, 9న కరీంనగర్, 10న సిరిసిల్లలో యాత్ర ఉండనుంది. మలిదశ ఉద్యమానికి కేంద్ర బిందువైన కరీంనగర్‌లో పార్టీకి పునర్వైభవం తెచ్చేందుకు కేసీఆర్ ఈ యాత్ర చేపట్టారు.

నృసింహుని ఆలయానికి ఆధునిక హంగులు



కొత్తరూపు సంతరించుకున్న ఆలయం

పెద్దపల్లిరూరల్: దేవునిపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం కొత్తరూపు సంతరించుకుంది. జైనుల కాలంలో నిర్మించిన ఆలయాన్ని ఆధునికీకరించేందుకు ఈవో శంకరయ్య దాతల సాయం తీసుకున్నారు. అమెరికాలో స్థిరపడ్డ పాలకుర్తి మండలం కుక్కలగూడురుకు చెందిన పోతరాజుల అంబిక–రాధాకృష్ణ దంపతులు ఆలయ ఆధునికీకరణకు రూ.10లక్షలు సాయం చేయడంతో ప్రభుత్వం వద్ద కార్పస్ ఫండ్‌గా జమచేశారు. దీంతో రూ.52 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులు వెచ్చించి ఆలయాన్ని ఆధునికీకరిస్తున్నారు. పనులు చివరి దశకు చేరాయి. పలువురు కాంట్రాక్టర్లు, వ్యాపారులు కూడా సహకారాలు అందిస్తున్నారు. చుట్టూ ప్రహరీ, ప్రవేశద్వారం వద్ద గోపురం నిర్మించారు. ఇంకా కొన్ని పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఏటా కార్తీక మాసంలో బ్రహ్మోత్సవాలు, జాతరకు పలు జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు.

చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం



ధాన్యం పరిశీలిస్తున్న ప్రవీణ్‌రెడ్డి

సుల్తానాబాద్(పెద్దపల్లి): రైతుల నుంచి చివరిగింజ వరకూ కొనుగోలు చేస్తామని జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. శనివారం కురిసిన అకాల వర్షానికి తడిసిన స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని ధాన్యాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. వేసవి కావడంతో తడిసిన ధాన్యం ఒక్కరోజులోనే ఎండుతుందని, నిర్దేశిత తేమ వచ్చిన తర్వాత కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన పడొద్దన్నారు. అనంతరం పౌరసరఫరాల డీఎం శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీమాల తడిసిన ధాన్యం పరిశీలించారు.

పైపులైన్లకు మరమ్మతు



మరమ్మతు పనుల్లో జేసీబీ

సాక్షి ఎఫెక్ట్..

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 39వ డివిజన్ గౌతమినగర్ ప్రధాన చౌరస్తాలో కొద్దిరోజులుగా తాగునీటి పైప్‌లైన్ లీకై తాగునీరు వృథాగా పోతుంది. ఈ విషయంపై 'పగులుతున్న పైపులు' శీర్షికన ఈనెల 9న 'సాక్షి' కథనం ప్రచురించింది. స్పందించిన కార్పొరేషన్ అధికారులు ఆదివారం పైప్‌లైన్ మరమ్మతు పనులు ప్రారంభించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన 'సాక్షి'కి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆన్‌లైన్ సర్వేల జోరు

- ఫోన్, సోషల్ మీడియాలో హోరెత్తుతున్న సర్వే
- గెలుపోటములపై సాగుతున్న అభిప్రాయసేకరణ
- ప్రభుత్వానికి నివేదిక పంపిన నిఘా వర్గాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి జిల్లాలో పార్లమెంట్ పోరు మెల్లిగా వేడెక్కుతోంది. పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్ పార్లమెంట్ స్థానాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం ప్రారంభించారు. ఇదే సమయంలో ఏ పార్టీ గెలుస్తుంది..? అన్న విషయంపై సర్వేలు కూడా ఊపందుకున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక రాజకీయాలు స్వల్పంగా మార్పు చెందుతున్నాయి. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు ఆరోపణలు, ప్రత్యారోపణలతో ఓటర్లను తమవైపునకు తిప్పుకునే యత్నం చేస్తున్నారు. నియోజకవర్గాల వారీగా పర్యటిస్తూ.. ప్రచారాన్ని హోరెత్తిస్తూ.. సభలు, సమావేశాలతో తలమునకలవుతున్నారు.

మార్పు కనిపెట్టేందుకు..

ఈ నేపథ్యంలో ప్రజాభిప్రాయంలో స్వల్ప మార్పు వచ్చింది. ఈ మార్పు ఎవరికి అనుకూలం..? ఎవరికి వ్యతిరేకం అన్న విషయంపై స్పష్టత కోసం అన్ని పార్టీల నుంచి అప్పుడే రహస్య సర్వే టీమ్‌లు రంగంలోకి దిగాయి. ఎవరి స్టైల్లో వారు ఓటర్ల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నారు. ఇందు కోసం సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగిస్తున్నారు. పార్టీల మేనిఫెస్టోలు, విధానాలపై పలు రకాల పోస్టింగులు రూపొందించి వాటిపై జనాలు స్పందిస్తున్న తీరు ఆధారంగా సమాచారం సేకరిస్తున్నారు. అలాగే వయసుల వారీగా పలు రకాల ప్రశ్నలను సంధిస్తూ ఓటర్ల మనోగతాన్ని తెలుసుకునే యత్నం చేస్తున్నారు. ఏ విషయంలో ప్రజల అభిప్రాయం మారుతుందో నిశితంగా తెలుసుకునే యత్నం చేస్తున్నారు. పబ్లిక్ పల్స్ పట్టుకుని తదనుగుణంగా పాలసీలు, హామీలు, ప్రత్యర్థులపై ఆరోపణాస్త్రాలు సంధించేందుకు వ్యూహాలు రూపొందించుకుంటున్నారు.



పూర్తయిన ఇంటలిజెన్స్ సర్వే

సాధారణంగా నిఘా వర్గాలు ఎన్నికల ముందు, నోటిఫికేషన్ వచ్చిన తరువాత రాజకీయ పరిస్థితి, ఓటర్ల అభిప్రాయాలపై కచ్చితమైన సమాచారం పంపిస్తాయి. అలాగే ఉమ్మడి జిల్లాలోనూ ఈ సర్వే ఇటీవల పూర్తయింది. పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్ సెగ్మెంట్లలోని 13 నియోజకవర్గాల్లో రెండోసారి సర్వే కూడా పూర్తి చేశారు. వాస్తవానికి నామినేషన్లకు ముందు ఒకసారి రిపోర్టు పంపిన అధికారులు.. నామినేషన్ల తరువాత కూడా ప్రభుత్వానికి ఓ రిపోర్టు పంపారు. ప్రభుత్వ పాలసీలు అమలవుతున్న తీరు.. వాటిపై ప్రజల అభిప్రాయం.. లోపాలు తదితరాలపై సమగ్ర సమాచారం సేకరించారు. ముఖ్యంగా మహిళల అభిప్రాయాలకు సర్వే రిపోర్టులో పెద్దపీట వేసినట్లు తెలిసింది.

దంచికొడుతున్న ఎండలు

- పారిశ్రామిక ప్రాంతంలో 45డిగ్రీల సెల్సియస్‌కు చేరిన ఉష్ణోగ్రతలు
- సింగరేణి ఓసీపీల్లో పెరుగుతున్న వేడితీవ్రత
- పనివేళలు మార్చాలని కార్మికులు, కార్మిక నాయకుల డిమాండ్

గోదావరిఖని: కోల్‌బెల్ట్ ప్రాంతంలో ఎండలు దంచికొడుతున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు 45డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవుతున్నాయి. ఓసీపీల్లో మరో నాలుగు లేదా ఐదు డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉంటోంది. ఉదయం పదిగంటల నుంచే మాడ పగిలేలా సూర్యుడు ఉగ్రరూపం చూపిస్తున్నాడు. ఓసీపీలు, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారాలు ఉండడంతో ఇతర ప్రాంతాలకన్నా ఉష్ణోగ్రతలు ఇక్కడ అధికంగా నమోదు అవుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు వివరిస్తున్నారు. మండుతున్న ఎండలకు ఇళ్లనుంచి బయటకు వెళ్లేందుకు కార్మికులు, పారిశ్రామిక ప్రజలు జంకుతున్నారు.

ఓసీపీలపై తీవ్ర ప్రభావం..

- జిల్లాలో విస్తరించి ఉన్న సింగరేణి సంస్థలో ఆర్జీ–1, 2, 3 ఏరియాల్లో నాలుగు ఓసీపీలు బొగ్గు ఉత్పత్తిలో అగ్రగామిగా నిలుస్తున్నాయి.
- వీటిలో సుమారు మూడు వేల మందికిపైగా కార్మికులు పనిచేస్తున్నారు.
- క్వారీ(ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు – ఓసీపీ)ల్లో షావల్స్, డోజర్లు, గ్రేడర్లు, లోడర్స్ తదితర యంత్రాలపై వారు నిత్యం పనిచేస్తున్నారు.
- అయితే క్వారీల్లో పనిచేసే ట్రిప్‌మెన్లు, జనరల్ మజ్దూర్లు, కేబుల్ బాయ్‌లు, మిగతా కాంట్రాక్టు ఉద్యోగులు ఎండతీవ్రతకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.
- ప్రధానంగా ఫస్ట్, సెకండ్ షిఫ్టుల్లో ఓసీపీల్లో డ్యూటీలకు హాజరయ్యే కార్మికులు ఎండల తీవ్రతకు భయపడుతున్నారు.
- మరోవైపు.. భూగర్భ గనుల్లో ఎండ ప్రభావం పెద్ద కనిపించదు.

ఓసీపీల్లో అత్యధిక వేడి..

సాధారణ ప్రాంతాలతో పోలిస్తే పారిశ్రామిక ప్రాంతంలో ఎండవేడి సహజంగానే అధికంగా ఉంటోంది. ప్రధానంగా ఓసీపీల్లో ఎండవేడి మరింతగా ఎక్కువగా ఉంటోంది. బయట 43 డిగ్రీల సెల్సియస్ నుంచి 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైతే.. క్వారీల్లో మరో ఐదు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయని కార్మికులు అంటున్నారు. ఈక్రమంలో ఉదయం, మధ్యాహ్నం షిఫ్టుల్లో పనిచేస్తున్న కార్మికులు ఎండతీవ్రతకు భయపడుతున్నారు. ప్రధానంగా క్వారీలో పనిచేస్తున్న జనరల్ మజ్దూర్లు, ట్రిప్‌మెన్లు, ఓవర్‌మెన్‌లు ఎండవేడి భరిస్తూనే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.



గొడుగు పట్టుకుని క్వారీలో విధులు నిర్వహిస్తున్న కార్మికుడు

ఉపశమనానికి చర్యలు..

ఎండవేడి నుంచి కార్మికులకు ఉపశమనం కలిగించేందుకు సింగరేణి యాజమాన్యం పలు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఓసీపీల్లోని క్వారీలు, డంప్‌యార్డుల వద్ద చలువ పందిళ్లు, చల్లని తాగునీటి కోసం రంజన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లతోపాటు మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్నారు. ఏసీలు ఉన్న డంపర్లు, షావల్స్, డోజర్లను మాత్రమే నడిపిస్తున్నారు. ఏసీలు పనిచేయని వాటిని తాత్కాలికంగా పక్కన పెడుతున్నారు.

పనివేళలు మార్చాలి..

- ఓసీపీల్లో ఎండ తీవ్రత దృష్ట్యా పనివేళలు మార్చాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.
- సాధారణంగా మొదటి షిఫ్ట్ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3 గంటలు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 11గంటల వరకు ఉంటుంది.
- వేసవిలో మండుతున్న ఎండల దృష్ట్యా మొదటి షిఫ్టును ఉదయం 5 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, రెండో షిఫ్టును సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 12గంటల వరకు మార్చాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

కాషాయమయం.. కొండగట్టు క్షేత్రం

- నేటి నుంచి అంజన్న చిన్న జయంతి ఉత్సవాలు
- తరలిరానున్న రెండు లక్షల మంది
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లాలోని కొండగట్టు అంజన్న సన్నిధి కాషాయమయంగా మారింది. ఈనెల 22 నుంచి 24వరకు హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. తెలంగాణతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది హనుమాన్ దీక్షస్వాములు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో వారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, ఈవో చంద్రశేఖర్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. తాగునీటితోపాటు తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఫైరింజన్‌ను అందుబాటులో ఉంచారు. 650 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. దిగువ కొండగట్టు నుంచి కొండపైకి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నారు. అలాగే మెట్లదారి కూడా సిద్ధమైంది. జేఎన్టీయూ వైపు నుంచి వచ్చే వాహనాలకు బొజ్జ పోతన్న సమీపంలో పార్కింగ్ గుర్తించారు. దీక్షస్వాములు మంగళవారం అర్ధరాత్రి వరకు స్వామివారిని దర్శించుకుని అనంతరం మాల విరమణ చేయనున్నారు. సమస్యలుంటే 94910 00653 నంబర్‌లో సంప్రదించాలని ఆలయ ఏవో చంద్రశేఖర్ తెలిపారు.



కార్మికుల సంక్షేమమే ధ్యేయం

- రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- దుర్గానగర్‌లో ఐఎన్‌టీయూసీ మహాసభ

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. స్థానిక దుర్గానగర్‌లో ఆదివారం జరిగిన ఐఎన్‌టీయూసీ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని సింగరేణి కార్మికుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించే నాయకుడు అవసరమన్నారు. విద్యాధికుడు, తెలివైన వ్యక్తి, పారిశ్రామికవేత్త గడ్డం వంశీకృష్ణను గెలిపిస్తే ఈప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలంటే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని ఆయన ఆకాంక్షించారు. కార్మికుల కోసం నిరంతరం పోరాడే యూనియన్ ఐఎన్‌టీయూసీ అని అన్నారు. చెన్నూరు, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు వివేక్, వినోద్ మాట్లాడుతూ ఈప్రాంత సమస్యలు పరిష్కరించే సత్తా వంశీకి ఉందన్నారు. యూనియన్ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి మాట్లాడుతూ కార్మిక సంఘాలు కార్మికుల సంక్షేమం, వారిని ఆర్థికంగా బలపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ భూ గర్భగనులు, కొత్తగా ఉద్యోగాలు తీసుకొచ్చే ప్రయత్నంలో ఉన్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడితే ఇన్‌కం ట్యాక్స్ మాఫీ చేస్తామన్నారు. సమావేశంలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, నాయకులు నర్సింహారెడ్డి, ధర్మపురి, సింగరేణిలోని 11 ఏరియాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

సమస్యల పరిష్కారానికి ఉద్యమం

- ఆటో యూనియన్ల జేఏసీ నేత రవికుమార్

మంథని: ఆటోవాలా సమస్యల పరిష్కారం కోసం ఈనెల24 నుంచి విడతల వారీగా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని ఆటో యూనియన్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ తెలిపారు. ఆదివారం మంథని డివిజన్‌లోని కమాన్‌పూర్, రామగిరి, మంథని మండలంలోని ఆటో డ్రైవర్లు, యూనియన్ నాయకులను ఆయన కలిసి మాట్లాడారు. ఈనెల 24న తహసీల్దార్, 26న కలెక్టర్, 28న శాసనసభ్యులకు వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. మే 9న మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సంఘం అధికార ప్రతినిధి దార మధు, నాయకులు మట్ట నరసయ్య, యాసిన్, రమేశ్, పాలపుల్ల ప్రసాద్, దాసరి నవీన్, కట్ల సతీశ్, తుంగల రాజు, తోటపల్లి సంతోష్, శ్రీనివాస్, సలీం, ఖదీర్, బుక్క శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఆస్పత్రి ఉంది రెఫర్ చేయడానికే..

- వైద్యుడు, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీ
- ఆర్నెల్లుగా టీబీ పేషెంట్లకు తప్పని తిప్పలు
- నిరుపయోగంగా ప్రభుత్వ క్షయ దవాఖాన

జ్యోతినగర్(రామగుండం): జిల్లాలోనే అతిపెద్ద క్షయ నియంత్రణ ఆస్పత్రి ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌లో ఉంది. ఎన్టీపీసీ ఉద్యోగులు నిర్వహణ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సాయి సేవా సమితి ఆవరణలోని సకల సౌకర్యాలు కలిగిన ఓ భవనం ఆస్పత్రి కోసం కేటాయించారు. ఆస్పత్రిలో ఆధునిక ఎక్స్‌రే యంత్రం అమర్చారు. వైద్యులు, సిబ్బందికి మెరుగైన వసతీసౌకర్యాలు కల్పించారు. కానీ, డాక్టర్, ల్యాబ్ టెక్నీషియన్, రేడియాలజీ సిబ్బంది పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దాదాపు ఆర్నెల్లుగా క్షయ నియంత్రణ ఆస్పత్రిలో ఇదే దుస్థితి కొనసాగుతోంది.

డాక్టర్.. డబుల్ డ్యూటీ..

వైద్యులు లేక పేషెంట్లకు సకాలంలో వైద్య సేవలు అందడంలేదు.

- వైద్య సిబ్బంది కొరత కూడా వేధిస్తోంది.
- దీంతో ఈ ఆస్పత్రి సమీపంలోని ఐసీటీసీ ల్యాబ్ టెక్నీషియన్ సేవలు వినియోగించుకోవాల్సిన దుస్థితి నెలకొంది.
- అంతేకాదు.. క్షయ నియంత్రణ ఆస్పత్రి డాక్టరే ఐసీటీసీలోని పేషెంట్లకు వైద్యసేవలు అందిస్తూ వస్తున్నారు.
- ప్రస్తుతం ఈ రెండు ఆస్పత్రులకు డాక్టర్ కొరత ఏర్పడింది.
- గతంలో రోజూ 20 మందికిపైగా అవుట్ పేషెంట్లు వచ్చేవారు.
- ప్రస్తుతం వస్తున్న పేషెంట్లను గోదావరిఖని జనరల్ ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు.
- ప్రసుత్తం క్షయ వ్యాధి సెంటర్‌లో ఒక సూపర్‌వైజర్, మరో ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్, ఐసీటీసీ కేంద్రంలో ఒక ల్యాబ్‌టెక్నీషియన్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు.
- సిబ్బంది, డాక్టరు లేకపోవడంతో ఆస్పత్రిలోని ఎక్స్‌రే యంత్రం, ల్యాబ్ మూలనపడి నిరుపయోగంగా మారాయి.

డిస్పెన్సరీతో మేలు..

క్షయ వ్యాధి నియంత్రణ కేంద్రంలో డాక్టర్ లేక పేషెంట్లకు వైద్యసేవలు అందడం లేదు. రామగుండంలో ప్రైమరీ హెల్త్ సెంటర్‌తోపాటు డిస్పెన్సరీ కూడా ఉంది. ఎన్టీపీసీ మేడిపల్లి ప్రాంతంలోని క్షయ వ్యాధి కేంద్రంలో డిస్పెన్సరీ ఏర్పాటు చేస్తే పేషెంట్లకు వైద్యసేవలు అందే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ఎన్టీపీసీలోని ప్రభుత్వ క్షయ ఆస్పత్రి



మూలన పడ్డ ఎక్స్‌రే యంత్రం



ఖాళీగా ఉన్న ల్యాబ్


హెచ్‌ఐవీ పరీక్షలు చేస్తున్నాం



మేడిపల్లి సెంటర్ సాయి సేవా సమితిలోని ఐసీటీసీ కేంద్రంలో ప్రస్తుతం హెచ్‌ఐవీ నిర్ధారణ పరీక్షలే చేస్తున్నాం. చికిత్స అవసరమైన వారిని గోదావరిఖని ఏఆర్‌టీ సెంటర్‌కు రెఫర్ చేస్తున్నాం.

– శ్రీనివాస్, ల్యాబ్‌టెక్నీషియన్, ఐసీటీసీ

డాక్టర్ పోస్టు ఖాళీగా ఉంది



ఎన్టీపీసీలోని క్షయ వ్యాధి చికిత్స కేంద్రానికి డాక్టర్‌ను నియమించలేదు. చికిత్స కోసం వచ్చే పేషెంట్లను గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి పంపిస్తున్నాం. కేంద్రంలో ఫాలో అప్ ట్రీట్‌మెంట్ మాత్రమే అందిస్తున్నాం. డాక్టరు, వైద్య సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులకు నివేదించాం.

– ప్రమోద్‌కుమార్, డీ అండ్ ఎంహెచ్‌వో

ఫాలోఅప్ ట్రీట్‌మెంట్ ఇస్తున్నాం

క్షయ నిర్ధారణ అయిన వారికి ఆస్పత్రిలో ఫాలోఅప్ ట్రీట్‌మెంట్ అందిస్తున్నాం. ఆస్పత్రిలో డాక్టర్‌తోపాటు ల్యాబ్ టెక్నీషియన్, రేడియాలజిస్టు లేరు. పేషెంట్లు వస్తే చికిత్స కోసం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నాం.

– గోపి, ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్, క్షయ ఆస్పత్రి



క్లుప్తంగా

చికిత్స పొందుతూ ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుడు మృతి

జ్యోతినగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుడు మడిపల్లి రవీందర్(53) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈనెల 16న అన్నపూర్ణకాలనీలోని నివాసం నుంచి సైకిల్‌పై విధులకు వెళ్తున్న రవీందర్ మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారి క్రాస్ చేస్తున్న సమయంలో.. గోదావరిఖని వైపు నుంచి వచ్చిన కారు ఢీకొంది. తీవ్ర గాయాలైన రవీందర్‌ను చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం డాక్టర్ల సూచన మేరకు కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుడి భార్య అరుణ ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కరీంనగర్‌లో బాలుడు..

కరీంనగర్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బాలుడు మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. రామడుగుకు చెందిన ఐదు సంవత్సరాల కీర్తి చైత్రిక్ గుండె సంబంధిత సమస్యతో బాధపడుతుండడంతో.. కుటుంబ సభ్యులు ఈనెల 19న నగరంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అతడికి ఈనెల 20న ఆపరేషన్ చేశారు. అదే రోజు రాత్రి బాలుడు మృతిచెందాడు. డాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఆపరేషన్ వికటించడంతోనే తమ బాబు మృతిచెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. బాధ్యులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పెగడపల్లిలో యువకుడు..

పెగడపల్లి: నందగిరి శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంకటి చంద్రశేఖర్(31) ఆదివారం మృతిచెందినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గొల్లపల్లి మండలం ఇస్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్, బీమ్‌రాజ్‌పల్లికి చెందిన రెవెల్లి స్వామి అనే ఇద్దరు వ్యక్తులు శనివారం మధ్యాహ్నం గంగాధర మండల కేంద్రంలోని సంతకు వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్నారు. పెగడపల్లి మండలం నందగిరి శివారులో ఎదురుగా వస్తున్న టాటాఏసీ వాహనం వీరిని ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న చంద్రశేఖర్, స్వామి గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వీరిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం చికిత్స పొందుతూ చంద్రశేఖర్ మృతిచెందగా.. స్వామికి కాలు విరిగినట్లు ఎస్సై వివరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

సుల్తానాబాద్‌రూరల్: పెద్దపల్లి జిల్లాసుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామానికి చెందిన పోగుల రాయమల్లమ్మ(57) అనే మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. ఎస్సై శ్రావణ్ కుమార్, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం .. రాయమల్లమ్మ అదే గ్రామానికి చెందిన సంపత్ వద్ద రూ.1.30లక్షలను 5 సంవత్సరాల క్రితం అప్పు తీసుకోగా.. రూ.లక్ష చెల్లించింది. మిగతా రూ.30వేలు చెల్లించాలని శనివారం ఇంటి వద్ద గొడవకు దిగడంతో.. మనస్తాపం చెందిన రాయమల్లమ్మ ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతురాలి కొడుకు ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎన్టీపీసీ 'నీటి' పొదుపు

- పర్యావరణ పరిరక్షణ.. మురుగునీటి శుద్ధి
- రూ.5 కోట్లతో ఆధునిక ఎస్టీపీ నిర్మాణం



శుద్ధి అవుతున్న మురుగునీరు



ఎన్టీపీసీలోని మురుగునీటి శుద్ధి కేంద్రం

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తితో పాటు నీటి పొదుపును కూడా చేపట్టి పలు పరిశ్రమలకు ఆదర్శంగా నిలిచింది. మురుగునీటిని(మురుగునీటి శుద్ధి కర్మాగారం) శుద్ధి చేసి, వ్యర్థ జలాలను వినియోగిస్తోంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న చర్యల్లో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో రూ.5కోట్లతో నిర్మించిన ఆధునిక ఎస్టీపీ ఎన్టీపీసీలోనే ఉండడం దీని ప్రత్యేకత.

తెలంగాణ స్టేజీ–1 ప్రాజెక్టు నిధులతో..

- తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు స్టేజీ–1లో భాగంగా దాదాపు రూ.5 కోట్ల అభివృద్ధి నిధులతో ఎస్టీపీ నిర్మాణం పూర్తిచేసింది.
- మురుగునీటి శుద్ధి కేంద్రం 3.5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో పనిచేస్తోంది.
- రాష్ట్ర రాజధానిలో దాదాపు తొమ్మిది ఎస్టీపీలు పనిచేస్తుండగా, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోనే అతిపెద్ద అత్యాధునిక ఎస్టీపీ వ్యవస్థ రామగుండం ఎన్టీపీసీ ప్రాంతంలోనే నిర్మించడంతో సంస్థ ఆదర్శంగా నిలుస్తోంది.

మురుగునీటి శుద్ధి..

ఎన్టీపీసీ ప్రాజెక్టు పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని నివాసాల నుంచి వెలువడే మురుగునీటితోపాటు వ్యర్థ జలాలు, పారిశ్రామిక వ్యర్థ జలాలు, టీటీఎస్‌లోని కొంత మురుగు నీరు ఈఎస్టీపీ ద్వారా శుద్ధి చేస్తున్నారు. కొత్తగా నిర్మించిన ఎస్టీపీ ప్రత్యేక ల్యాబ్ సౌకర్యంతో ఆధునిక మోడ్‌లో పనిచేస్తోంది.

30 ఏళ్ల క్రితమే..

- ఎన్టీపీసీ ప్రాజెక్టు సమీపంలో మురుగునీటిని శుద్ధి చేసేందుకు ఖాజీపల్లి సమీపంలో 30 ఏళ్ల క్రితం ఏరియేటర్ మోటార్ల సాయంతో మురుగునీటి శుద్ధి ప్లాంటు నిర్మించారు.
- అప్పటినుంచే మురుగునీటిని శుద్ధి చేస్తున్నారు.
- అయితే, సాంకేతిక కారాణాలతో దానిని కొంత కాలం క్రితం మూసివేశారు.
- తెలంగాణ పవర్ ప్రాజెక్ట్ అభివృద్ధి నిధులతో దాని సమీపంలోనే ఎన్టీపీ నిర్మించిన మరో ఎస్టీపీని వినియోగంలోకి తీసుకువచ్చారు.
- మురుగునీరు, గాలిని ఎరేటింగ్ చేయడం ద్వారా నీటిని శుద్ధి చేస్తున్నారు.
- మురుగునీటిని జీవరసాయన పద్ధతిలో ఎంబీబీఆర్(మూవింగ్ బెడ్ బయోఫిల్మ్ రియాక్టర్) ట్యాంకుల్లో శుద్ధి చేస్తున్నారు.
- తర్వాత మళ్లీ క్లోరిన్ కంట్రోల్ ట్యాంకుల ద్వారా నీటిని శుద్ధి చేసి వినియోగంలోకి తీసుకువస్తున్నారు.

మొక్కలకు వినియోగం

ఎస్టీపీలో శుద్ధి చేసిన తర్వాత పర్మినెంట్ టౌన్‌షిప్ పార్కుల్లోని మొక్కలు, మియావాకీ(చిట్టడవి) విధానంలో నాటిన మొక్కలు, నర్సరీల్లోని మొక్కల పెంపకానికి నీటిని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం పీటీఎస్ (పర్మినెంట్ టౌన్‌షిప్) నుంచి 0.7 ఎంఎల్‌డీ మురుగునీరు మాత్రమే ఎస్టీపీకి చేరుతోంది. ఈ కొత్త విధానంలోఎన్టీపీసీ పర్యావరణ పరిరక్షణకు ఎంతో కృషి చేస్తోంది.

'ఖని'లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ప్రచారం

- మంగళహారతులతో స్వాగతం పలికిన మహిళలు



ఈశ్వర్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

గోదావరిఖని: వివిధ ప్రాంతాల్లో పెద్దపల్లి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఆదివారం ప్రచారం నిర్వహించారు. స్థానిక మేకలమండి, చంద్రశేఖర్‌నగర్, తిలక్‌నగర్‌లో పర్యటించి కారుగుర్తుకు ఓటువేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

50శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి



మాట్లాడుతున్న మహేందర్, నాయకులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో 50శాతం, దేశజనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు కేంద్రంలో మంత్రిత్వ శాఖలేకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి ఏటా రూ.20,000 కోట్ల బడ్జెట్ కేటాయించాలని, బీసీలకు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని, నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు దశరథం, మేడవరపు రాజేశ్‌కుమార్, జంగిల్, నిఖిల్, ప్రశాంత్, క్రాంతి పాల్గొన్నారు.

అంబేడ్కర్ యూనివర్సిటీ సేవలు భేష్

మంథని: రెగ్యులర్ విద్యను అభ్యసించలేని విద్యార్థులకు అవసరమైన ఉన్నత విద్యను అందిస్తున్న అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం కృషి అమోఘమని స్థానిక అధ్యయన కేంద్రం సమన్వయ కర్త కర్నాటి కృష్ణ అన్నా రు. ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభ్యాసకుల సహాయ కేంద్రంలో నిర్వహించిన అభ్యాసకుల పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉన్నత విద్యలో సార్వత్రిక విశ్వవిద్యాలయం సేవలు శ్లాఘనీయమన్నారు. కౌన్సిలర్లు తిరుపతి, మానస, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

వివాదంగా మారిన టెండర్లు?

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగర పాలక సంస్థలో అత్యవసర పనులు చేపట్టడానికి ఇటీవల పిలిచిన టెండర్లలో వివాదం తలెత్తింది. పనులు దక్కించుకునేందుకు రింగ్ అయినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంట్రాక్టర్ల మధ్య సయోధ్య కుదరకపోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసుకునేంత వరకు వెళ్లిందని సమాచారం. అర్హతలేని కాంట్రాక్టర్లకు పనులు కేటాయించారని ఆరోపిస్తూ ఓ కాంట్రాక్టర్ ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. గతంలో చేసిన అభివృద్ధి పనులపై ఇప్పటికే వచ్చిన ఫిర్యాదులకు ఒకవైపు విజిలెన్స్ విభాగం అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

- 5 కిలోల గంజాయి స్వాధీనం
- తరలించినా, విక్రయించినా కేసులు
- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ: గంజాయి తరలించినా.. విక్రయించినా పీడీ యాక్టు కేసు నమోదు చేస్తామని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వేములవాడ ప్రాంతంలో యువతరాన్ని టార్గెట్ చేసుకొని అక్రమంగా గంజాయి అమ్మకాలు చేస్తున్న ముగ్గురిని పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. రూరల్ సీఐ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వికాస్ అనే వ్యక్తి ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు మైనర్ల ద్వారా ఒడిశా రాష్ట్రం నుంచి 5 కిలోల గంజాయిని తెప్పించి జగదల్పూర్‌లో కలుసుకున్నారన్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో గంజాయికి అలవాటు పడిన వ్యక్తులకు ఎక్కువ ధరకు అమ్మి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో జగదల్పూర్ నుంచి ట్రావెల్స్ బస్సు ద్వారా కరీంనగర్‌కు వచ్చారని పేర్కొన్నారు. అక్కడ్నుంచి బస్సులో వేములవాడకు చేరుకొని చింతల్‌ఠానా గ్రామ శివారుకు వస్తున్నారనే సమాచారం మేరకు ఈనెల 20న సాయంత్రం 5 గంటలకు చింతల్‌ఠానా శివారులోని ఆర్టీసీ బస్‌డిపో దగ్గర ముగ్గురిని వేములవాడ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించినట్లు చెప్పారు. వికాస్ అనే వ్యక్తి ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు మైనర్ వ్యక్తుల ద్వారా గంజాయిని జగదల్పూర్‌కు తెప్పించి అక్కడ్నుంచి ముగ్గురు కలిసి వేములవాడ వచ్చి ఇక్కడ వివిధ ప్రాంతాల్లో గంజాయికి అలవాటు పడిన వ్యక్తులకు ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు చెప్పారన్నారు. వారి వద్ద నుంచి 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గంజాయి నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరచిన ఐడీ పార్టీ కానిస్టేబుళ్లు సమీ, గోపాల్, శ్రీనివాస్, ఎస్సై అంజయ్య, రూరల్ సీఐ శ్రీనివాస్‌ను ఎస్పీ అభినందించి రివార్డులు అందించారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని, ఈ సంవత్సరం జిల్లాలో అక్రమ గంజాయికి సంబంధించిన 14 కేసులు నమోదు చేసి 39 మందిని అరెస్ట్ చేశామన్నారు. మెసేజ్ యూవర్ ఎస్పీ నెంబర్ 630–392–2572కు లేదా డయల్–100కి సమాచారమందించి గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. వేములవాడ ఇన్‌చార్జి డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై అంజయ్య తదితరులున్నారు.

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అందుగులపల్లి సమీపంలో ఆదివారం కారు అదుపుతప్పి బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దకల్వలకు చెందిన ఉప్పు సాగర్, ఉప్పు శ్రీనివాస్‌తోపాటు డ్రైవర్ అనిల్‌కుమార్ కారులో ప్రయాణిస్తున్నారు. వీరంతా బసంత్‌నగర్‌లో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడ్డ సాగర్, శ్రీనివాస్‌ను వెంటనే స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తీసుకెళ్లినట్టు గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రమాదంలో గాయపడ్డ వారు ఆసుపత్రిలో కోలుకుంటున్నారని తెలిపారు.

నిద్దరోతున్న నిఘా



ఇది గోదావరిఖని శారదానగర్‌లోని వాటర్ ట్యాంక్. తాగునీటి సరఫరా కోసం దీని ప్రాంగణంలో ముఖ్యమైన, అతి విలువైన పరికరాలు ఇక్కడే భద్రపర్చారు. వీటి భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ఇది. అధికారుల పర్యవేక్షణ లేక సీసీ కెమెరా ఇలా ఆకాశం వైపు చూస్తోంది. దొంగల నుంచి విలువైన యంత్ర పరికరాల భద్రత ఎలా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

- ఆకాశం వైపు సీసీ కెమెరాల చూపు
- కొన్నిచోట్ల ధ్వంసమైన వైనం
- యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలు
- సులువుగా తప్పించుకుంటున్న నేరస్తులు
- వాటర్ ట్యాంకులకు పొంచిఉన్న ముప్పు



అలంకారప్రాయం సంజయ్‌గాంధీనగర్ వాటర్ ట్యాంక్‌కు అమర్చిన సీసీ కెమెరాలు



శారదానగర్ వాటర్ ట్యాంక్‌కు అమర్చిన సీసీ కెమెరా

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలోని వాటర్ ట్యాంకులు, ఓపెన్‌జిమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిద్దరోతున్నాయి. అవి పని చేయకపోవడంతో బల్దియాకు అనేక రకాలుగా నష్టం జరుగుతోంది. ఇప్పటికే పలు వాటర్ ట్యాంకుల వద్ద కొన్ని ధ్వంసమయ్యాయి. సీసీ కెమెరాలు లేక సిబ్బందిలో కూడా జవాబుదారీతనం గాడితప్పింది. గతంలో ఓపెన్‌జిమ్ పరికరాలను దొంగలు చోరీ చేయడానికి యత్నించారు. సీసీ కెమెరాలు పనిచేయడం లేదనే విషయం బల్దియా అధికారులకు తెలిసినా తగిన చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నగరంలో 40 సీసీ కెమెరాల ఏర్పాటు..

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని బీ–పవర్‌హౌస్, భీమునిపట్నం, హెలిపాడ్, శారదానగర్, సీఎస్‌పీ కాలనీ, అశోక్‌నగర్, పాతమున్సిపల్ కార్యాలయం, సంజయ్‌నగర్, ఎన్టీఆర్‌నగర్, విఠల్‌నగర్, ఆర్‌ఎఫ్‌సీఎల్, న్యూమారేడుపాక, అల్లూరు ప్రాంతాల్లో మొత్తం 13 వాటర్ ట్యాంకులు ఉన్నాయి. ఇవి నిషిద్ధ ప్రాంతాలు. నిఘా కోసం కొన్నింటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పీజీ కాలేజీ మైదానం, గౌతమినగర్ పార్క్, దుర్గానగర్ పార్క్, బల్దియా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ల వద్ద కూడా వీటిని బిగించారు. ఇలా మొత్తంగా నగరపాలక సంస్థ సుమారు 40 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది.

పనిచేయని కెమెరాలు..

వాటర్ ట్యాంకుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కొంతకాలంగా పనిచేయడం లేదు. మరికొన్నిచోట్ల దుండగులు ధ్వంసం చేశారు. యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. సంజయ్‌గాంధీనగర్, శారదానగర్‌లో ఇటీవల నీటి సరఫరా విభాగానికి చెందిన కొన్ని వస్తువులు చోరీకి గురయ్యాయి. అప్పుడు సీసీ కెమెరాలు పని చేయలేదు. దీంతో దొంగలను గుర్తించలేకపోయారు. ఓపెన్ జిమ్‌ల వద్ద సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా మారాయి. కొన్నిచోట్ల మాయమయ్యాయి.

సిబ్బందిలో లోపించిన జవాబుదారీతనం..

సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో వాటర్ ట్యాంకుల వద్ద పనిచేస్తున్న సిబ్బందిలో జవాబుదారీతనం లోపిస్తోంది. గ్రావిటీ ద్వారా ఉపరితల జలాశయాలను నింపే క్రమంలో ట్యాంకులు నీటితో నిండిపోయినప్పటికీ సిబ్బంది సకాలంలో వాల్వ్‌ను ఆఫ్ చేయడం లేదు. దీంతో విలువైన తాగునీరు కొన్ని గంటలపాటు రోడ్లపై వృథాగా పోతోంది.

ఫుటేజీలతో తక్షణ చర్యలకు అవకాశం..

సీసీ కెమెరాలు బంధిస్తున్న దృశ్యాల ఆధారంగా అధికారులు అప్పటికప్పుడు తక్షణ చర్యలు చేపట్టడానికి అవకాశాలున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో అధికారులు సెల్‌ఫోన్లలో ఫుటేజీల్లోని దృశ్యాలు వీక్షిస్తూ తదనుగుణంగా ఆదేశాలు జారీచేసే అవకాశం ఉంది. ఉపరితల జలశయాల వద్ద ఉన్న అన్ని కెమెరాలను పనిచేసేలా తగిన చర్యలు తీసుకుంటే అధికారుల పర్యవేక్షణతో సిబ్బందిలో జవాబుదారీతనం కూడా పెరిగే అవకాశం ఉంటుంది. అలాగే నీటి వృథాను అరికట్టే వీలుంది. అంతేకాదు.. జలశయాల ఆవరణలోని యంత్రాలు, వస్తువులు చోరీకి గురికాకుండా జాగ్రత్త పడవచ్చు. వాటర్ ట్యాంకులపైకి ఆకతాయిలు చేరకుండా, వారి దుశ్చర్యలనూ నియంత్రించవచ్చు.

సైబర్ మోసగాళ్ల అరెస్టు

- దుబాయ్ కేంద్రంగా సైబర్ చీటింగ్ దందా
- కోరుట్ల వాసికి రూ.4.23 కోట్ల మోసం
- నాలుగు నెలల క్రితం కేసు నమోదు
- కేరళలో నిందితుల ఆచూకీ..
- ఐదుగురి అరెస్టు చూపిన పోలీసులు

కోరుట్ల: నాలుగు నెలల క్రితం కోరుట్లకు చెందిన బాసెట్టి శంకరయ్య అనే ఓ విశ్రాంత ఇంజినీర్‌ను సీబీఐ కేసు పేరిట బెదిరించి రూ.4.23 కోట్లు ఆన్‌లైన్‌లో కాజేసిన ఉదంతంలో కేరళకు చెందిన ఐదుగురిని ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. జగిత్యాల కోర్టులో హాజరుపర్చారు.

సీబీఐ కేసు పేరిట మోసం

కోరుట్లకు చెందిన బాసెట్టి శంకరయ్య తిరుపతిలో నివాసముంటున్నాడు. ఏడాది క్రితం కొందరు వ్యక్తులు అతడికి ఫోన్ చేసి తనపై సీబీఐ కేసు నమోదు అయిందని దాన్ని కొట్టేయాలంటే అధికారులను మేనేజ్ చేయాల్సి ఉంటుందని చెప్పి విడతల వారీగా సుమారు రూ.4.23 కోట్లు కాజేశారు. సదరు డబ్బులను ఆన్‌లైన్‌లో తాము చెప్పిన అకౌంట్లలోకి మళ్లించాలని నిందితులు సూచించిన మేర బాధితుడు అకౌంట్లకు పంపించాడు. అనంతరం సీబీఐ పేరిట తనను మోసం చేశారని తెలుసుకున్న బాధితుడు గతేడాది డిసెంబర్ 27న కోరుట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భారీ సైబర్ చీటింగ్

జిల్లాలో భారీ సైబర్ చీటింగ్ కేసుగా గుర్తింపు పొందిన ఈ ఘటనలో అసలు నిందితుడు దుబాయ్‌లో ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. దుబాయ్ కేంద్రంగా తెలంగాణ, ఉత్తరాఖండ్, రాజస్తాన్, కేరళ రాష్ట్రాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని పక్కాగా సైబర్ మోసాలకు పాల్పడుతున్న కేరళకు చెందిన ముఠా సభ్యులు షౌకత్ అలీ, అబ్దుల్ బాసిత్ మున్నాలీ, సిద్ధిఖీ అన్వర్, అజ్మల్, కమ్రొద్దీన్‌లను కోరుట్ల పోలీసులు వారం రోజుల పాటు శ్రమించి పట్టుకున్నారు. కొంత డబ్బు ఆశచూపి అనామకుల ఆధార్‌కార్డులతో బ్యాంక్ అకౌంట్లు తీసి వారి ఖాతాల్లోని డబ్బులు మళ్లించి వాటిని కాజేసినట్లు తెలిసింది. పెద్ద మొత్తంలో జరిగిన ఈ సైబర్ చీటింగ్ కేసును జిల్లా పోలీసు యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఐదుగురు నిందితులను పట్టుకోవడం విశేషం.

న్యాయం చేయాలని మహిళ నిరసన



పిల్లలతో దీక్ష చేస్తున్న ఇస్రత్ సుల్తానా

పెద్దపల్లిరూరల్: తమ ఇంటిని అక్రమంగా ఆక్రమించుకొని తమకు అన్యాయం చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని మా ఇంటిని మాకు ఇప్పించాలంటూ ఆదివారం పెద్దపల్లి పట్టణంలోని నల్లపోచమ్మవాడకు చెందిన ఇస్రత్ సుల్తానా తన ఇద్దరు పిల్లలతో కలిసి నిరసన దీక్షకు దిగింది. ఇస్రత్ సుల్తానా వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా నారాయణపేటకు చెందిన ఇస్రత్ సుల్తానాకు పెద్దపల్లి పట్టణానికి చెందిన ఖాజా అలీతో వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. ఖాజా అలీ ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లి ఏడాదిన్నర క్రితం సౌదీలోనే గుండెపోటుకు గురై మరణించాడు. కొంతకాలం తర్వాత ఇస్రత్ సుల్తానా తమ పుట్టింటికి వెళ్లి ఉండగా.. మృతుడు ఖాజా అలీ సోదరుడు సాజిద్ అలీ తమ్ముడి ఇంటిని ఆక్రమించుకున్నాడు. మా ఇంటిని ఖాళీ చేయాలంటూ ఇస్రత్ సుల్తానా మజీద్ కమిటీ, పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈనెల 20న ఇల్లు ఖాళీ చేసి అప్పగిస్తానంటూ చెప్పిన సాజిద్ అలీ ఇంటికి తాళం వేసి ఎటో వెళ్లిపోయాడని, అందుకే తను వచ్చేదాకా ఇంటిముందే టెంట్ వేసుకొని నిరసనకు దిగానని ఇస్రత్ సుల్తానా తెలిపింది. తన ఇద్దరు పిల్లలతో పాటు తనకు దక్కాల్సిన ఇంటిని అన్యాయంగా ఆక్రమించుకొని తమను ఇబ్బంది పెడుతున్న సాజిద్ అలీపై చర్యలు తీసుకొని తనకు ఇల్లు ఇప్పించి న్యాయం చేయాలని వేడుకుంటోంది.

అనుమతి లేదు.. సౌకర్యాలు కల్పించరు

- నిబంధనలకు విరుద్ధంగా ఇటుకబట్టీల నిర్వహణ



గోదావరి తీరంలోని ఇటుక బట్టీలు

గోదావరిఖని: రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో అనుమతులు లేని ఇటుక బట్టీ వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. తద్వారా, జల, వాయు తదితర వనరులు కలుషితమవుతున్నాయి. అయినా, సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. అక్రమంగా మట్టి తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు కూడా అటు వైపు కన్నెత్తి చూడడంలేదు. మరోవైపు.. వసతుల లేమి, కనీస వేతనాలకు నోచుకోక కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు.

గోదావరి నది చెంతనే బట్టీలు..

- గోదావరి నది వంతెన సమీపంలో పెద్ద సంఖ్యలో ఇటుక బట్టీలు ఏర్పాటు చేశారు.
- ఇందులో ఇటుకల తయారీకి ఊక, మట్టి, కర్రలు వినియోగిస్తున్నారు.
- వీటిని కాల్చడం ద్వారా వాయువు కలుషితమవుతోంది.
- కలుషితమైన నీరు సమీపంలోని గోదావరి నదిలో కలుస్తున్నాయి.
- ఈ నీటిని తాగిన జలచరాలేకాదు.. జంతువులు, పక్షులు కూడా పలు వ్యాధులకు గురవుతున్నాయనే అంటున్నారు.
- రూ.కోట్లలో వ్యాపారం చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న కొందరు వ్యాపారులు.. వారు వినియోగించే నేలన కూడా నాలా కన్వర్షన్ చేయించడంలేదనే విమర్శలు ఉన్నాయి.
- ఇతర రాష్ట్రాల నుంచి వలస కార్మికులను తీసుకొచ్చి ఇటుక బట్టీల్లో పనిచేయిస్తున్నారు.
- కార్మికులకు విద్య, వైద్యం, పీఎఫ్ ఈఎస్‌ఐ తదితర సౌకర్యాలు కల్పించడం లేదు.
- కనీసం వేతన పట్టిక కూడా ప్రదర్శించడం లేదు.
- కనీస సౌకర్యాలు లేని రేకుల షెడ్లలో కార్మికులు నివాసం ఉంటూ నానాఇబ్బందులకు గురవుతున్నారు.

చర్యలు తీసుకోవాలి

అనుమతిలేకుండా ఇటుకబట్టీలు నిర్వహిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొచ్చి కనీస వేతనాలు చెల్లించడం లేదు. సౌకర్యాలు కల్పించడం లేదు. గోదావరి నీటిని కూడా కలుషితం చేస్తున్నారు. ఈవిషయంలో అధికారులు జోక్యం చేసుకోవాలి.

గుండెపోటుతో తెలుగు ఉపాధ్యాయుడి మృతి

గోదావరిఖనిటౌన్: సుమారు 40 ఏళ్లనుంచి అనేక ప్రైవేట్ పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేసి తను కూడా ఒక పాఠశాల యజమానిగా 10 ఏళ్లపాటు విధులు నిర్వహించిన స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన పి.వేణుగోపాలస్వామి ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. పలువురు కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రముఖులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్థానిక చౌరస్తా అడ్డా టాటా మ్యాజిక్ యూనియన్ ప్రెసిడెంట్ ఎండీ అమర్ సిద్దీకి అలీయస్ బాబర్ తన గురుభక్తిని చాటుకున్నాడు. మృతుడి చివరి మజిలీకయ్యే ఖర్చు తనే భరించడంతోపాటు గురువుకు సొంత ఇల్లు లేకపోవడంతో బాబర్ తన ఇంట్లోనే పెద్దకర్మ అయ్యేవరకు ఆశ్రయం కల్పించనున్నాడు.

శాంతికోసం ప్రార్థించండి

మంథని: క్రైస్తవులు బైబిల్ చదువుతూ, ప్రార్థనలు చేస్తూ శాంతి స్థాపన కోసం కృషి చేయాలని విశాఖపట్నానికి చెందిన పాస్టర్ జాన్‌పాల్ కోరారు. స్థానిక సియోను ప్రార్థనా మందిరంలో మూడురోజుల పాటు జరిగిన వార్షిక సభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలో శాంతికోసం ఎల్లప్పుడూ ప్రార్థనలు చేయాలన్నారు. పాస్టర్లు వల్లూరి ప్రభాకర్, మహేశ్, ఆజ్మిర దయారాజ్, మంథని మార్క్, కలువల సామ్యెల్, రాజేశ్, సంఘం పెద్దలు అంకరి కుమార్, జోసెఫ్, మంథని ప్రసాద్, అందె రమేశ్, దాసరి సదానందం, రామగిరి కుమార్, సదానందం పాల్గొన్నారు.